సాక్షి కామారెడ్డి
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



అంతర్రాష్ట్ర దొంగల ముఠా..
బ్యాంక్ లోన్‌ల పేరుతో ఐదు జిల్లాల్లో మోసాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను భిక్కనూరు పోలీసులు అరెస్టు చేశారు.
- 8లో ▸



వానొస్తే ముంపు ముప్పు
ముందస్తు చర్యలు లేక బాన్సువాడ పట్టణం లోని కొత్త కాలనీలు నీట మునుగుతున్నాయి. చిన్న వర్షానికి రోడ్లు జలమయమవుతున్నాయి.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /21.5

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మొబైల్ ఫోరెన్సిక్‌తో మెరుగైన సేవలు



కామారెడ్డి క్రైం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలతో రూపొందించిన మొబైల్ ఫోరెన్సిక్ వాహనం జిల్లా పోలీసులకు మరింత మెరుగైన సేవలు అందించగలదని ఎస్పీ రాజేశ్ చంద్ర అన్నారు. ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం కామారెడ్డి జిల్లాకు నూతనంగా మంజూరు చేసిన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని గురువారం జిల్లా పోలీసు కార్యాయలం వద్ద ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలు జరిగిన ప్రదేశాల్లో సాక్ష్యాధారాలను సేకరించి నిందితులను గుర్తించడంలో ఫోరెన్సిక్ విభాగం పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, పలువురు సీఐలు, ఎస్సైలు, క్లూస్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్ తహసీల్‌కు పోస్టులు మంజూరు

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కొత్తగా ఏర్పాటైన మహమ్మద్‌నగర్ రెవెన్యూ మండలానికి 13 పోస్టులు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, సర్వేయర్, చైన్‌మెన్, ముగ్గురు అటెండర్ పోస్టులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మండల రెవెన్యూ కార్యాలయానికి సరిపడా పోస్టులు మంజూరు కావడంతో పోస్టింగులు ఇవ్వడానికి మార్గం సుగమమైంది. ఇంతకాలం డిప్యుటేషన్‌పై ఉన్న ఒకరిద్దరు అధికారులు, సిబ్బందిని నెట్టుకువచ్చారు. పోస్టులు మంజూరవడంతో రెగ్యులర్ అధికారులు, సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది.

పాఠశాలల్లో లైబ్రరీ పీరియడ్ నిర్వహించాలి



భిక్కనూరు: పాఠశాలల్లో లైబ్రరీ పీరియడ్‌ను తప్పనిసరిగా నిర్వహించి విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి టి.వేణుగోపాల్ అన్నారు. గురువారం భిక్కనూరు రైల్వే స్టేషన్ ప్రాథమిక పాఠశాలతోపాటు ఇతర పాఠశాలలను వేణుగోపాల్ తనిఖీ చేశారు. పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ అమలు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో వర్క్ షీట్ల ద్వారా ఎప్పటికప్పుడు సాధన చేయిస్తూ పాఠ్య పుస్తకం, పాఠ్య ప్రణాళిక, వర్క్ బుక్‌ల మధ్య అలైన్‌మెంట్ పాటించాలని సూచించారు.

జూలైలో 1708 డ్రంకన్‌డ్రైవ్ కేసులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూలైలో 1708 డ్రంకన్‌డ్రైవ్ కేసులు నమోదైనట్లు సీపీ సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. 1708 మందిలో 966 మందిపై అభియోగాలు మోపుతూ చార్జిషీట్‌లు కోర్టులో వేయగా వారు నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. 77 మందికి జైలు శిక్ష, మిగతా కేసుల్లో జరిమానాలు విధించినట్లు తెలిపారు. తమ అభ్యర్థన మేరకు ఆర్టీఏ అధికారులు జూలై నెలలో 62 డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేసినట్లు సీపీ తెలిపారు.

వామ్మో బస్సు..



మద్దికుంట నుంచి కామారెడ్డికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు గతేడాది ఆగస్టు 21న రామారెడ్డి మండల కేంద్రానికి సమీపంలో స్టీరింగ్ రాడ్ సమస్యతో రోడ్డు కిందికి దిగింది. బస్సులో వంద మందికిపైగా ప్రయాణికులు ఉన్నారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బస్సును పరిశీలించి ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడారు.





జూలై 19న లింగంపేట మండలం ఎల్లారం సమీపంలో బస్సు లారీ ఢీకొన్న ప్రమాదంలో బస్సులో ఉన్న పలువురితోపాటు లారీ డ్రైవర్‌కు సైతం గాయాలయ్యాయి.

ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండా వద్ద ఇటీవల ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్న ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి.





ఈ ఏడాది జూన్ 9న రాజంపేట మండలం పెద్దాయిపల్లి స్టేజీ సమీపంలో ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పెద్దాయిపల్లి గ్రామానికి చెందిన తాతామనవళ్లు సిద్ధరాములు, శ్రేయాంక్ అక్కడికక్కడే మరణించారు.

తాడ్వాయి మండలంలో మహిళ కాలు మీదుగా బస్సు టైర్ వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయి ఆస్పత్రి పాలైంది.

బాన్సువాడ మండలం బోర్లం క్యాంపు వద్ద గురువారం బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో ముగ్గురికి గాయాలయ్యాయి.

- వరుస ప్రమాదాలతో బస్సును చూస్తే జడుసుకునే పరిస్థితి
- కాలం చెల్లిన ప్రగతి రథాలు
- పరిమితికి మించి ప్రయాణికులు
- ఒత్తిడిలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులకు సంబంధించిన ప్రమాదాలు పెరుగుతున్నాయి. గడిచిన ఏడాది కాలంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి. పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కుతున్నారు. ఒక్కోసారి బస్సులో వంద మందికి పైగానే ఉంటున్నారు. ప్రయాణికులు ఒకరినొకరు తోసుకోవడంతో ప్రతి రోజూ బస్సుల్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో డ్రైవర్ ఏకాగ్రత దెబ్బతింటోంది. కాలం చెల్లిన బస్సులను నడపడమే ఇబ్బందికరంగా మారిన పరిస్థితి ఒక వైపు, బస్సులో పరిమితికి మించి జనాలు ఎక్కడం, ఆపై పనిగంటలు పెరగడంతో డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ డిపోలు మాత్రమే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లె వెలుగు బస్సులు చాలా వరకు కాలం చెల్లినవే తిప్పుతున్నారు. కొన్ని బస్సుల స్టీరింగ్ ఊడిరావడం, మరికొన్ని టైర్లు ఊడిపోవడం వంటి ఘటనలు ఉన్నాయి. ఒక్కోసారి బ్రేక్ ఫెయిలై ప్రమాదాలు జరుగుతున్నాయి.

చాలా బస్సుల్లో ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ కనిపిస్తున్నారు. కనీసం కాలుతీసి కాలు పెట్టే పరిస్థితి ఉండదు. దీనికి తోడు సీట్ల గోళ ఎక్కువవుతోంది. ప్రయాణికులు కూర్చునేందుకు కాదుగదా కాలు పెట్టే పరిస్థితి లేక ఒకరినొకరు తోసుకోవడంతో గొడవలు జరుగుతున్నాయి. అలాగే ఉచిత ప్రయాణం చేసే మహిళల్ని మగవారు చులకన చేసి మాట్లాడడం, దానికి వారు ఎదురు సమాధానం ఇవ్వడం కూడా గొడవలకు దారితీస్తోంది. కిక్కిరిసిన బస్సులో టిక్కెట్‌లు తీయడం కండక్టర్‌కు గుర్రంమీద స్వారీ చేసినట్టుగానే ఉంటోంది. డ్రైవర్ పరిస్థితి మరింత భయంకరంగా తయారవుతోంది. ప్రయాణికులు బానెట్ మీదకి వచ్చి కూర్చుంటున్నారు.

కాలం చెల్లిన బస్సులు

పల్లె వెలుగు బస్సుల్లో కొన్ని కాలం చెల్లినవి ఉంటున్నాయి. దశాబ్దాల కాలంగా లక్షలాది కిలోమీటర్లు తిరిగిన బస్సులను మరమ్మతులు చేస్తూ నడిపిస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెరగడం లేదు. ఉన్న బస్సుల్లో కొన్ని మూలకు చేరుతున్నా వాటి స్థానంలో కొత్తవి రావడం లేదు. చాలా వరకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులే వస్తున్నాయి. పల్లెవెలుగులు రాకపోవడంతో ఉన్నవాటినే తిప్పుతున్నారు. దీంతో వాటిని నడపడం కూడా డ్రైవర్లకు సవాల్‌గా మారింది. దీనికితోడు అప్పట్లో 8 గంటల డ్యూటీ చేసి ఇంటికి వెళ్లే డ్రైవర్లు, కండక్టర్లు ఇప్పుడు 12 గంటలు ఆగకుండా చేయాలి. మరుసటి మళ్లీ డ్యూటీకి వెళ్లి మరో 12 గంటలు చేయాల్సిందే. ఇలా వరుసగా డ్యూటీ చేయడం కారణంగా అలసటకు గురికావడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

ప్రమాదం జరిగితే డ్రైవర్నే బాధ్యుడిని చేస్తున్నారు

కాలం చెల్లిన బస్సులు, రెస్ట్ లేకుండా పనిచేయడం మూలంగా జరిగే ప్రమాదాల్లోనూ ఆర్టీసీ యాజమాన్యం డ్రైవర్లను బాధ్యులను చేసి తప్పించుకుంటోంది. బస్సులు కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలసిన బాధ్యత యాజమాన్యంపైనే ఉంటుంది. బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడానికి కారణం బస్సుల సంఖ్య తక్కువగా ఉండడమే. అలాగే బస్సుల కాలపరిమితి ఎప్పుడో ముగిసిపోయినా, మరమ్మతులు చేసి తిప్పుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంస్థ యాజమాన్యం తప్పును తమపైకి తోసి తప్పించుకుంటోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు పనుల జాతర

- ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ఘనంగా నిర్వహించాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో పనుల జాతర కార్యక్రమాన్ని నేడు (శుక్రవారం) ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఆయా గ్రామసభల్లో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీవోలు, పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనేలా చూడాలన్నారు. గ్రామ సభల్లో గతేడాది చేపట్టిన జీపీ, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, ఉద్యానవనాలు, సోక్ పిట్స్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సెగ్రిగేషన్ షెడ్‌లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు, పశువుల కొట్టాలు, కోళ్ల షెడ్లు తదితర పనుల వివరాలతోపాటు ఆయా పనులు చేపట్టడం ద్వారా గ్రామంలోని ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వివరించాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో అత్యధిక రోజులు పని చేసిన కూలీలను, దివ్యాంగ కూలీలను, మల్టీపర్పస్ వర్కర్లను సన్మానించాలని డీఆర్డీవో సురేందర్‌ను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇతర అన్ని ప్రభుత్వ ఆస్తుల భవనాలపై సోలార్ విద్యుత్ సిస్టంను ఏర్పాటు చేయడానికి చేపట్టిన క్షేత్రస్థాయి సర్వే వివరాలతో కూడిన జాబితాను వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ రమణను ఆదేశించారు. జిల్లాలోని అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాల్లో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ప్రవేశాలు పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏటీసీ కేంద్రాల్లో అధునాతన కోర్సులను అభ్యసిస్తే వచ్చే ఉద్యోగ అవకాశాలను యువతకు వివరించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో 11,818 ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసినట్లు తెలిపారు. వాటిలో 5,909 గృహాలకు మార్కింగ్ ఇచ్చి ప్రారంభించామన్నారు. 2660 గృహాలు బేస్‌మెంట్ స్థాయి వరకు, 283 ఇళ్లు గదుల, 107 స్లాబ్ వరకు నిర్మాణం పూర్తయ్యాయని వివరించారు. 100 శాతం పూర్తయిన ఇళ్ల నిర్మాణాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. తప్పుగా నమోదైన లబ్ధిదారుల ఆధార్ కార్డుల సవరణ త్వరగా పూర్తి చేయించాలన్నారు. ఇళ్లను త్వరితగతిన నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యను వీలైనంత త్వరగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, హౌసింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి, డీపీవో మురళి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌కు తగ్గిన వరద

- ఇన్‌ఫ్లో 52,477.. అవుట్ ఫ్లో 37,291 క్యూసెక్కులు



నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల నుంచి విడుదలవుతున్న వరద నీరు

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. గురువారం సాయంత్రానికి 52,477 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. 9 గేట్ల ద్వారా 37,291 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1402.58 అడుగుల (14.438 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

కౌలాస్‌లోకి 1,403 క్యూసెక్కులు..

జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి 1,403 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీలు)గాను ప్రస్తుతం 457.60 మీటర్లు (1.141 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఒక గేటు ద్వారా 648 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేస్తున్నారు.

కల్యాణిలోకి 200 క్యూసెక్కులు..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులో ఉన్న కల్యాణి ప్రాజెకులోకి 200 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు గురువారం తెలిపారు. కల్యాణి వాగు ద్వారా ప్రాజెక్టులోకి 200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరిందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 అడుగులకు గాను 408.30 అడుగుల నీటిని నిలువ ఉంచుతూ 100 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌కు డైవర్షన్ చేయగా 100 క్యూసెక్కుల నీటిని ఒక వరద గేటు ఎత్తి నీటిని మంజీరాలోకి వదిలినట్లు అధికారులు తెలిపారు.

మొరాయించిన వరద గేటు

నిజాంసాగర్ (జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టు 16 గేట్ల ప్రాంతంలోని 10 నంబర్ వరద గేటు గురువారం కిందకు దిగకుండా మొరాయించింది. ఇన్ ఫ్లో తగ్గుముఖం పట్టడంతో నీటిపారుదల శాఖ సిబ్బంది గేట్లను మూసి వేస్తుండగా పదో నంబర్ గేటు ఉదయం నుంచి రాత్రి వరకు కిందకు దిగలేదు. ఆ గేటు నుంచి నీరు కిందికి వెళ్తోంది. గేటును ఇనుప రాడ్లు, గునపాలతో బాదుతూ కిందకు దించేందుకు రాత్రివేళ నీటిపారుదల సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. గేటు మొరాయించిన విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు.

సమన్వయంతో పనిచేయాలి

- గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి
- శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్, పాల్గొన్న ఎస్పీ రాజేశ్‌చంద్ర, సబ్ కలెక్టర్ కిరణ్మయి

కామారెడ్డి క్రైం: జిల్లాలో వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అన్ని మతాల పెద్దలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశాన్ని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని సిద్ధంగా ఉందన్నా రు. ప్రజలందరూ సోదర భావంతో మెలగాలన్నా రు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. మండపం ఏర్పాటు చేసే ప్రాంతానికి అనువైన పరిమాణంలో ఉన్న వినాయక ప్రతిమలను తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలు ఇ బ్బందులకు గురి కాకుండా చూడాలన్నారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముందస్తు అనుమతులు తప్పనిసరి అని, నిబంధనలకు లోబడి లౌడ్ స్పీకర్లను వినియోగించాలన్నారు. నిమజ్జన సమయంలో తగిన జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల ను సక్రమంగా నిర్వహించాలని, రోడ్లు, విద్యుత్ తీ గల మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్, మండల స్థాయిలలో శాంతి కమిటీలను ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఎస్పీ రాజేశ్‌చంద్ర, ఏఎస్పీ నరసింహారెడ్డి, అదనపు కలెక్టర్ చందర్, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆడిటింగ్ పేరుతో వసూళ్లు

- టీవీవీపీ పరిధిలోని ఆస్పత్రుల్లో కొనసాగుతున్న ఆడిటింగ్
- వైద్య ఉద్యోగులపై సూపరింటెండెంట్‌ల ఒత్తిడి

కామారెడ్డి టౌన్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జిల్లా వ్యాప్తంగా ఆడిటింగ్ కొనసాగుతోంది. ఆస్పత్రుల్లో ఆర్థిక అంశాలు, నిధుల వినియోగం, ఆదాయ, వ్యయాలు, భోజన బిల్లుల చెల్లింపులు తదితర ఆర్థిక అంశాల్లో నిధుల దుర్వినియోగం బయటకు రాకుండా ఉద్యోగుల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆడిటింగ్ అధికారులు, సూపరింటెండెంట్‌లు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ ఏరియా ఆస్పత్రులతో పాటు దోమకొండ, ఎల్లారెడ్డి, గాంధారి, పిట్లం, బిచ్కుంద, మద్నూర్, నాగిరెడ్డిపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లు తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆస్పత్రుల్లో ఆడిటింగ్ మొదలైంది. ఆస్పత్రుల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతోపాటు, ఆరోగ్యశ్రీ నిధులు, సర్జికల్, మెడిసిన్స్ కొనుగోలు, ఆరోగ్య బీమా పథకం నిధుల వినియోగంలో పలువురు సూపరింటెండెంట్‌లు భారీగా అవకతవకలు పాల్పడ్డారని పలువురు పేర్కొంటున్నారు. రోగులకు అందించే భోజనం బిల్లుల్లో డైట్ కాంట్రాక్టర్‌తోపాటు సూపరింటెండెంట్‌లపై ఆరోపణలున్నాయి. ఓ సీహెచ్‌సీలో డైట్ బిల్లు ఎక్కువ మొత్తంలో డ్రా చేసినట్లు గుర్తించిన ఆడిటింగ్ సిబ్బంది సదరు గుత్తేదారు నుంచి రూ.1.50 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. తక్కువ మంది రోగులకు భోజనం అందించి ఎక్కువ బిల్లు డ్రా చేసినట్లు సమాచారం.

కుమ్మక్కు

ఆస్పత్రుల్లో జరిగిన నిధులు దుర్వినియోగాన్ని గుర్తించకుండా అన్ని సక్రమంగా ఉన్నాయని క్లియరెన్స్ ఇచ్చేందుకు ఆడిటింగ్ అధికారులకు భారీగా ముడుపులు ఇచ్చేందుకు పలువురు సూపరింటెండెంట్‌లు వారితో ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం. ఓ సీహెచ్‌సీకి సరఫరా అయిన మందులకు.. రోగులకు ఇచ్చిన మందుల వివరాలకు పొంతన లేకపోవడంతో సిబ్బంది నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. స్థాయిని బట్టి ఒక్కో ఉద్యోగి నుంచి రూ.3వేల ఉంచి రూ. 2వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. డబ్బులు ఇవ్వకుంటే ఆడిటింగ్‌లో తప్పులు తేలుతాయని, సస్పెన్షన్, మెమోలు జారీ చేస్తామని సూపరింటెండెంట్‌లు స్వయంగా వైద్య ఉద్యోగులపై ఒత్తిడి తెలుస్తున్నట్లు తెలుస్తోంది.

మత్తు పదార్థాలను అరికట్టాలి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కామారెడ్డి క్రైం: మత్తు పదార్థాలను అరికట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన మాదక ద్రవ్యాల నిర్మూలన కమిటీ సమావేశంలో మాట్లాడారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యార్థులు, యువతకు మత్తు పదార్థాల వాడకం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాల సరఫరాపై పోలీసు, ఎక్సైజ్ శాఖలు నిఘా పెట్టాలన్నారు. గంజాయి, మద్యానికి బానిసలైన వ్యక్తులకు కౌన్సెలింగ్ చేపట్టి వారిని సాధారణ స్థితికి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ.. సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కట్టడికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశ్వ సాహితీ కళావేదిక తెలంగాణ అధ్యక్షుడిగా శ్రీకాంత్



దోమకొండ: సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ విశ్వ సాహితీ కళావేదికకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన జెట్టబోయిన శ్రీకాంత్‌ను సంస్థ చైర్మన్ కొల్లి రమావతి నియమించారు. కవితాశ్వమేధం పుస్తక రచయిత జాతీయవాది జెట్టబోయిన శ్రీకాంత్‌ను తెలుగు గజల్ గాయకుడు, నటుడు, ఉద్యమకర్త 125 ప్రపంచ భాషలలో గజల్స్ పాడటం ద్వారా మూడు గిన్నిస్ రికార్డులు సాధించిన గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా సన్మానించి నియామక పత్రం అందజేశారు. ఈ నెల 17 న ఆవిర్భవించిన కళావేదిక తెలుగు భాషా సంరక్షణ, సాహితీ విలువల సంస్థాపన ధ్యేయంగా పనిచేస్తుందని కవులకు రచయితలకు ఇది ఒక అద్భుతమైన వేదిక అని శ్రీకాంత్ అన్నారు.

పునరావాసం కల్పించాలని వినతి



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం వల్ల తమకు ప్రాణభయం ఉందని తెలియజేస్తూ గురువారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి మర్పల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువనకు మర్పల్లి గ్రామం ఉండటంతో గ్రామం చుట్టూ వరద నీరు చేరుతుందని తమకు ఇతర ప్రాంతాల్లో స్థలాలు కేటాయిస్తే ఇళ్లు కట్టుకొని జీవనం సాగిస్తామని సబ్‌కలెక్టర్‌ను కోరారు. తమను ఆదుకోవాలని కోరారు. జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మన్ సొదాగర్ అరవింద్, మర్పల్లి గ్రామస్తులు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు నలుగురు విద్యార్థుల ఎంపిక



భిక్కనూరు: హైదరాబాద్ గౌలీపురలోని ఆలె నరేంద్ర స్టేడియంలో ఈ నెల 19న జరిగిన రాష్ట్ర స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీల్లో భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్, ఫిజికల్ డైరెక్టర్ వైన ర్సింహారెడ్డిలు తెలిపారు. అండర్–17 విభాగంలో పదో తరగతి చదువుతున్న జి.అంతోష్, బి.సుశాంత్, అండర్–15 విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.మహేశ్, డి.రాంచరణ్‌లు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. మహారాష్ట్రలోని షిరిడీలో ఈ నెల 23 నుంచి 28 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

దోమకొండకు 407 ఇందిరమ్మ ఇళ్లు

దోమకొండ: మండలానికి 407 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు దోమకొండ మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, ఇందిరమ్మ కమిటీ మెంబర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధులు తెలిపారు. లబ్ధిదారులకు గురువారం మంజూరు పత్రాలను అందజేశారు. వీవో యాదగిరి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు షమ్మీ, అబ్రబోయిన రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలే టార్గెట్..!

- లింగంపేట హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: రెండు రోజుల క్రితం లింగంపేట సమీపంలో వెలుగు చూసిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ హత్యలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిరచారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. లింగంపేటలోని మట్టకిందిపల్లి కాలనీకి చెందిన ఒడ్డె ఎరుగుదిండ్ల చిన్నక్క (41) భర్త గతంలోనే చనిపోగా కూలీ పనులు చేసుకుంటూ జీవించేది. ఈ నెల 4న పింఛన్ డబ్బులు తెచ్చుకుంటానని బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆమె మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు చేశారు. రామాయిపల్లి అటవీప్రాంతంలో చిన్నక్క మృతదేహాన్ని పోలీసులు రెండు రోజుల క్రితం కుళ్లిపోయిన స్థితిలో గుర్తించారు. హత్యగా నిర్ధారించి విచారణ కొనసాగించారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడిని పర్మల్ల తండాకు చెందిన బదావత్ ప్రకాష్ అలియాస్ చిరంజీవిగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడని ఎస్పీ తెలిపారు. ఈ నెల 4న నిందితుడు లింగంపేట కల్లు దుకాణం వద్ద చిన్నక్కను కలిసి మాటల్లో పెట్టాడు. డబ్బులు ఆశ చూపి తన వెంట అటవీప్రాంతంలోకి తీసుకువెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరగడంతో చీరతో మెడకు ఉరి బిగించి హత్య చేసి మృతురాలి సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యాడు. నిందితుడు ఒంటరిగా కనిపించిన మహిళలను టార్గెట్ చేస్తూ నేరాలకు పాల్పడటం అలవాటు చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. గతంలోనూ దేవునిపల్లి పీఎస్ పరిధిలో ఓ మహిళ విషయంలో కూడా ఇదే తరహాలో హత్యకు పాల్పడగా ప్రస్తుతం ఆ కేసు కోర్టు విచారణలో ఉందన్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ లింగారెడ్డి, లింగంపేట ఎస్సై దీపక్ కుమార్, సిబ్బంది సంపత్, లిక్యా నాయక్, అనిల్, శివ, రాజులు, ప్రకాష్‌లను ఎస్పీ అభినందించారు.




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర, ఇతర పోలీసు అధికారులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- బ్యాంక్ లోన్ ఇప్పిస్తామంటూ బంగారం, నగదు చోరీ
- ఐదు జిల్లాల్లో వెలుగుచూసిన ఘటనలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేష్ చంద్ర



నిందితులను చూపుతున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసు, సెల్‌ఫోన్లు

కామారెడ్డి క్రైం: సుమారు ఐదు జిల్లాల్లో బ్యాంక్ లోన్ ఇప్పిస్తామంటూ బాధితులను ఏమార్చి బంగారం, నగదు చోరీకి పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను కామారెడ్డి జిల్లా భిక్కనూరు పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. భిక్కనూర్‌కు చెందిన ఊరె లక్ష్మి దంపతులు స్థానికంగా బొంబు మర్చంట్ దుకాణం నడుపుతున్నారు. ఫిబ్రవరి 26న లక్ష్మి దుకాణంలో ఉండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మాటలు కలిపాడు. బ్యాంకు నుంచి వచ్చానని, మీ దుకాణంపై రుణం ఇప్పిస్తామని నమ్మించి లక్ష్మిని బ్యాంకుకు తీసుకువెళ్లాడు. పేదవారిగా కనిపిస్తేనే బ్యాంకు అధికారులు రుణం ఇస్తారని, మెడలోని బంగారు గొలుసు తీసేయాలని చెప్పారు. లక్ష్మి మెడలోని 3 తులాల బంగారం గొలుసును తీయగా, మేనేజర్ వద్దకు వెళ్లి వచ్చేదాకా తన వద్ద భద్రంగా ఉంచుతానని నమ్మబలికాడు. ఆమె దృష్టిని మళ్లించి అక్కడ నుంచి ఉడాయించారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, భిక్కనూర్ పోలీసులు విచారణ ప్రారంభించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఆఫ్తాబ్ అహ్మద్ షేక్, ఫహీమా బేగం అనే భార్యా భర్తలు కబీరుద్దీన్, దీపక్ కిసాన్ సలుంకే అనే మరో ఇద్దరితో కలిసి ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. భిక్కనూర్ టోల్ గేట్ వద్ద ఒకరిని, కామారెడ్డిలో ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితులు భిక్కనూర్‌తోపాటు ఆదిలాబాద్, నిర్మల్, హైదరాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ఈ తరహాలో మొత్తం 8 నేరాలు చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి బంగారు గొలుసు, రెండు కార్లు, ఓ ద్విచక్రవాహనం, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

పట్టించిన బైక్ నెంబర్ ప్లేట్..

అఫ్తాబ్ అహ్మద్ షేక్‌పై గతంలో 60 పైగా దృష్టి మళ్లింపు, చోరీ కేసులు ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పలు కేసుల్లో జైలుకు వెళ్లివచ్చినా చోరీలు చేస్తూనే ఉన్నాడు. అతడిని పట్టుకునేందుకు ఐదు జిల్లాల పోలీసులు చాలాకాలంగా గాలిస్తున్నా తప్పించుకు తిరుగుతున్నాడు. కొద్దిరోజుల క్రితం ఈ నేరస్థుడి గురించి దొంగ చిక్కడం లేదంటూ పలు టీవీ చానెళ్లలో వార్తా కథనాలు సైతం వచ్చాయన్నారు. ఇదిలా ఉండగా కేసులో ప్రధాన నిందితుడైన అఫ్తాబ్ అహ్మద్ షేక్ తప్పుడు నెంబర్ ప్లేట్‌తో ఉన్న బైక్‌ను వాడి పోలీసులకు చిక్కాడు. అతడు వాడిన బైక్ ముందర ఒక నెంబర్, వెనుక భాగంలో మరో నెంబర్ ఉండటాన్ని గమనించిన భిక్కనూర్ పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. జిల్లాలో ఇప్పటివరకు ఫేక్ నెంబర్ ప్లేట్‌లతో తిరుగుతున్న వాహనాలను పట్టుకుని 6 కేసులను ఛేదించినట్లు ఎస్పీ తెలిపారు. అందుకే వాహనాల తనిఖీలపై ఎక్కువగా దృష్టి పెట్టామన్నారు. కేసు ఛేదనకు కృషి చేసిన భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు ఆంజనేయులు, ఉస్మాన్, కానిస్టేబుళ్లు రవి, రాజేందర్, మైసయ్య, రమేష్ యాదవ్, మేకల నరేష్, జి నరేష్ లను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే



డోంగ్లీలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు

మద్నూర్(జుక్కల్): భారీ వర్షాలతో దెబ్బతిన్న రైతులకు పంట నష్ట పరిహారాన్ని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే డిమాండ్ చేశారు. డోంగ్లీ మండలంలో దెబ్బతిన్న పంటలను గురువారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కేసీఆర్ రైతులకు పంట పెట్టుబడి సాయంగా రైతుబంధును అందించేవారని, 6 గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన తర్వాత రైతులను విస్మరించిందని మండిపడ్డారు.

అధికారులకు ధన్యవాదాలు..

నాలుగు రోజుల క్రితం కురిసిన నియోజికవర్గంలోని నిజాంసాగర్, కౌలాస్ నాలా ప్రాజెక్ట్‌లలో ఎగువ భాగం నుంచి వరద నీరు వచ్చి చేరడంతో నిజాంసాగర్, కౌలాస్ నాలాల వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారన్నారు. దీంతో శెట్లూర్‌లో ముగ్గురు గొర్రెల కాపరులు, ఒక రైతుతో పాటు 656 గొర్రెలను ప్రాణాలతో కాపాడిన అధికారులకు, రెస్క్యూ టీం సభ్యులకు మాజీ ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు





రాజంపేట: అన్నారం తండాలో గురువారం తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా యువతులు 9 రోజుల పాటు గోధుమ నారుకు నీరు పోస్తూ పూజలు నిర్వహిస్తారు. చివరి రోజులో భాగంగా యువతులు మొలకల బుట్టలను నెత్తిపై పెట్టుకుని కుటుంబ సభ్యులతో తండా పెద్దలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

సంక్షిప్తం

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

లింగంపేట(ఎల్లారెడ్డి): వినాయకుల శోభాయాత్రకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎత్తైన విద్యుత్ స్తంభాలను గురువారం లింగంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు డీఈ విజయసారథి తెలిపారు. లింగంపేట మండల కేంద్రంలో ఎత్తు తక్కువగా ఉన్న 9.1 మీటర్ల స్తంభాలను గుర్తించి ఎక్కువ ఎత్తు గల 11 మీటర్ల స్తంభాలను వాటి స్థానంలో ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలన్నారు. ఏడీఈ మల్లేశం, ఏఈలు లక్ష్మయ్య సాయినాథ్, చందర్, తిరుపతిరెడ్డి, సిబ్బంది వహీద్, ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ వర్క్ విద్యార్థుల ఊరేగింపు

కామారెడ్డి అర్బన్: జాతీయ సోషల్ వర్క్ వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ఊరేగింపు నిర్వహించారు. వృద్ధాశ్రమం, అనాథ బాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వసతి గృహాల్లో విద్యార్థులకు వివిధ సమస్యలు, పరిష్కారంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, సోషల్ వర్క్ విభాగం అధిపతి జి.శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో సువర్ణ ప్రాశన

బాన్సువాడ: బాన్సువాడ సరస్వతి శిశు మందిర్‌లో గురువారం సువర్ణ ప్రాశన సంస్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమం యొక్క విశిష్టతను ప్రధానాచార్యులు నాగిరెడ్డి వివరించారు. సువర్ణ అంటే బంగారం అని, ప్రాశన అంటే తినడం అని వివరించారు. విద్యార్థులను ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉంచడం తల్లిదండ్రుల బాధ్యతని అన్నారు.

ఆర్యసమాజం ఆధ్వర్యంలో ఇంటింటా యజ్ఞం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో ఆర్యసమాజం ఆధ్వర్యంలో శ్రావణ మాసం ఇంటింటా యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్యసమాజం అధ్యక్షుడు పజాగెల విజయకుమార్ ఇంట్లో యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా బోనాల పండుగ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లిలో గంగామాత ఆలయ వార్షికోత్సంలో భాగంగా గురువారం బోనాల పండుగ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు.

క్రైం కార్నర్

రెండు బైకులు ఢీ: ఒకరి మృతి

మాచారెడ్డి: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి పట్టణంలోని కల్కినగర్‌కు చెందిన మంగళి హన్మాండ్లు (45) తన బైకుపై గురువారం మాచారెడ్డి నుంచి కామారెడ్డి వైపు బయలుదేరాడు. అదే సమయంలో గజ్యానాయక్ తండా చౌరస్తాకు చెందిన కడమంచి పండరి తన బైకుపై కామారెడ్డి వైపు నుంచి మాచారెడ్డి వైపు వస్తున్నాడు. పాల్వంచ మండల కేంద్రం శివారులో వారు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ ఘటనలో హన్మాండ్లు అక్కడికక్కడే మృతి చెందగా, పండరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పండరిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కాస్లాబాద్‌లో ఒకరి ఆత్మహత్య

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు .. గ్రామానికి చెందిన తడకంటి అలియాస్ గుడాల గణేశ్ (30) హజ్గుల్ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకొని ఇల్లరికం వెళ్లాడు. అతడి తల్లి గతంలో భర్తను చంపి జైలుకెళ్లింది. అతడు తరచుగా కాస్లాబాద్ గ్రామానికి వస్తుండేవాడు. ఇటీవల అతడు కాస్లాబాద్ వెళ్లగా మద్యానికి బానిసై ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. గురువారం అటువైపు వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

లింగంపేట(ఎల్లారెడ్డి): మెంగారం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలపై షీ టీమ్ అధికారి సుప్రజ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోడ్డు భద్రత, బాల్య వివాహాలు, బాలికలు తీసుకోవాల్సిన, బాలురు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎల్లారెడ్డి సబ్ డివిజన్ అధికారులు శ్రీశైలం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

బీకేఎస్ గ్రామ కమిటీ ఏర్పాటు

లింగంపేట(ఎల్లారెడ్డి): కోమట్‌పల్లి గ్రామానికి చెందిన భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) గ్రామ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాయిని బాల్‌రాజు, ఉపాధ్యక్షుడిగా అల్లు అల్లూరి, కోశాధికారిగా వేల్పుల రమేశ్, కార్యవర్గ సభ్యులుగా కుర్మ గంగమల్లు, వేల్పుల నర్సింలు, చాకలి అశోక్, అనిల్, నెల్లూరి గంగారాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సమాచారం..

నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తనయుడు ఇలియాజ్ పుట్టిన రోజు సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయకర్త బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్ తెలిపారు. రక్తదానం చేసే దాతలకు హెల్మెట్ బహుమతిగా అందజేస్తారని, దాతలు విజయవంతం చేయాలని కోరారు.

రేపు పట్టణ గణేష్ మండళ్ల సమావేశం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ గణేష్ మండపాల నిర్వాహకుల సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక సిరిసిల్లరోడ్డులోని కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ సామల గంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని ఆయా గణేష్ మండళ్ల అధ్యక్ష, కార్యదర్శులు, బాధ్యులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

26న దివ్యాంగ చిన్నారుల గుర్తింపునకు శిబిరం

గాంధారి(ఎల్లారెడ్డి): ప్రత్యేకావసరాలున్న దివ్యాంగ చిన్నారుల గుర్తింపు కోసం ఈ నెల 26న కామారెడ్డి పట్టణంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంఈవో శ్రీహరి తెలిపారు. ఈ శిబిరంలో దివ్యాంగ చిన్నారులకు అవసరమైన పరికరాలను ఉచితంగా అంజేస్తారని తెలిపారు. ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, యూడీఐ కార్డు, రెండు ఫొటోలు తీసుకుని ఉదయం 11 గంటల వరకు శిభిరం వద్ద ఉండాలని సూచించారు.

స్కూల్లో కొండచిలువ ప్రత్యక్షం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో బుధవారం రాత్రి భారీ కొండచిలువ ప్రత్యక్షమయింది. పాఠశాలలో నైట్‌వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న రియాజ్ స్కూల్ తలుపులు మూసేస్తుండగా పైనుంచి చెడుగు(పాము) కిందపడింది. దానిని కర్రతో కొట్టేలోపు అది పక్కనే చిన్నరంధ్రంలోకి వెళ్లింది. దీంతో రియాజ్ పాఠశాలలోని ఆఫీస్ రూం వైపు వెళ్తుండగా భారీ కొండచిలువ కనిపించింది. దీంతో భయాందోళనకు గురయ్యాడు. వెంటనే హాస్టల్ సిబ్బందితో పాములు పట్టే వ్యక్తిని పిలిపించి కొండచిలువను, అంతముకుందు రంధ్రంలోకి వెళ్లిన చెడుగును కర్రతో కొట్టి చంపారు. పాఠశాలలో పాములు ప్రత్యక్ష్యమవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు.

దాబా హోటల్ యజమానిపై కేసు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఓ దాబా హోటల్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో దాబా యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్రావ్ గురువారం తెలిపారు. పిట్లంలోని వెంగా బాయ్స్ దాబాలో ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్నారని సమాచారం రావడంతో దాబాపై గురువారం రాత్రి పోలీసులు దాడి చేశారు. దాబాలో ఉన్న మద్యాన్ని సీజ్ చేసి అట్టి దాబా యజమానిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా గురువారం సాయంత్రం మండలంలోని చిన్న కొడప్‌గల్ గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురుని పట్టుకొని వారి వద్ద నుంచి రూ. 5260 నగదు, రెండు ఫోన్లు ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పిన్‌కోడ్‌లో ఆరు అంకెల రహస్యం

మీకు తెలుసా?



సదాశివనగర్(ఎల్లారెడ్డి): తపాలా కార్యకలాపాల్లో పిన్‌కోడ్ నంబరులు కీలక పాత్ర పోషిస్తాయి. తపాలా శాఖ పరిధిలో ఉత్తర ప్రత్యుత్తరాలు చేసేందుకు ఆరు అంకెల పిన్‌కోడ్‌ను ఉపయోగిస్తారు.

- చాలా ఏళ్లుగా ఉత్తరాలు, వస్తువులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పంపడంతో పాటు ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మార్కెటింగ్ కార్యకలాపాలు పిన్ కోడ్ ఆధారంగా కొనసాగిస్తున్నారు.
- మన దేశంలో 1972 ఆగస్టు 15 నుంచి పిన్ కోడ్ నంబరు వినియోగంలోకి వచ్చింది.
- ఆరు అంకెలా పిన్‌కోడ్‌లో మొదటి అంకె జోన్‌ను, రెండో అంకెను సర్కిల్‌ను, మూడో అంకె జిల్లా చివరి మూడు అంకెలు తపాలా కార్యాలయం ఉన్న ప్రాంతంను సూచిస్తాయి. -ప్రధాన తపాలా కార్యాలయంతోపాటు ఉప తపాలా కార్యాలయాలకు కూడా పిన్‌కోడ్ నంబర్లను కేటాయించారు.
- పిన్‌కోడ్ నంబర్ల ఆధారంగా వినియోగదారులకు తపాలా సేవలు అందుబాటులోకి వచ్చాయి.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

కామారెడ్డి జీసీడీవో సుకన్య



ఉపాధ్యాయులతో సమావేశమైన జీసీడీవో సుకన్య

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని కామారెడ్డి జీసీడీవో సుకన్య ఆదేశించారు. నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతనుపరిశీలించారు. ఉపాధ్యాయులతో ఆమె సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వహించాలని ఆమె సూచించారు. అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలో మొత్తం 19 కస్తూర్బా పాఠశాలల్లో 5,800 మంది విద్యార్థినులు చదువుతున్నారన్నారు. వీటిలో 13 పాఠశాలల్లో ఇంటర్‌విద్య అమలవుతుందని చెప్పారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరయ్యేలా ఎఫ్‌ఆర్‌ఎస్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. పాఠశాల ప్రత్యేకాధికారిణి గీతతోపాటు ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎరువులు మోతాదుకు మించి వాడొద్దు



దుర్గంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఏడీఏ సుధామాధురి, ఏవో రాజలింగం

గాంధారి(ఎల్లారెడ్డి): రైతులు తాము సాగు చేసిన పంటలకు రసాయన ఎరువులను, పురుగు మందులను మోతాదుకు మించి వాడొద్దని ఎల్లారెడ్డి ఏడీఏ సుధామాధురి అన్నారు. గురువారం ఆమె, ఏవో రాజలింగంతో కలిసి మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. దుర్గం శివారులో మొక్కజొన్న పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోడానికి నానో యూరియా, డీఏపీ వాడాలని సూచించారు. నానో ఎరువుల నాణ్యత, ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం మండల కేంద్రంలో పలు రసాయన ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు.

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలి

- మురికి కాలువలు శుభ్రం చేయించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: వర్షాల ప్రభావంతో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పగడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గురువారం పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాలు కురిసిన అనంతరం ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. డ్రై డేను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. మరోసారి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మురికి కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమం ద్వారా కామారెడ్డి మున్సిపాలిటీకి నిర్దేశించిన రెండు లక్షల మొక్కలను ఈ నెలాఖరులోగా నాటాలన్నారు. నాటిన మొక్కలకు జియో ట్యాగింగ్ చేసి ఆన్‌లైన్‌లో వివరాలను పొందుపర్చాలని ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో మియావాకీ పద్ధతిలో మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి ని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ ఆర్మూర్ ఎంవీఐ

- ఆర్టీవో ఏజెంట్ వద్ద ప్రైవేటు డ్రైవర్ ద్వారా రూ.25 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం
- కార్యాలయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు



లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎంవీఐ వివేకానందరెడ్డి, పక్కనే డ్రైవర్ తిరుపతి

ఆర్మూర్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని ఏవీఐ కార్యాలయంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గుర్రం వివేకానందరెడ్డి రూ. 25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. పట్టణంలోని పెర్కిట్ శివారులో గల తన కార్యాలయంలో గురువారం జిల్లా కేంద్రానికి చెందిన ఫిర్యాదు దారుడి నుంచి తన ప్రైవేటు డ్రైవర్ తిరుపతి మధ్య వర్తిగా లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. వాహనాల రిజిస్ట్రేషన్, లైసెన్సుల పునరుద్ధణ, లెర్నింగ్ లైసెన్స్‌ల జారీ తదితర ఫైళ్ల క్లియరెన్స్‌కు ఏజెంట్ వద్ద ఎంవీఐ లంచం డిమాండ్ చేసాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు పక్కా ప్రణాళిక ప్రకారం సదరు ఏజంట్ ఎంవీఐ ప్రైవేటు డ్రైవర్‌కు రూ. 25 వేల లంచం ఇవ్వగా వాటిని డ్రైవర్ ఎంవీఐకి అందజేసాడు. వెంటనే ఏసీబీ అధికారులు రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ చంద్ర శేఖర్‌గౌడ్ వివరించారు. విచారణ పూర్తయిన అనంతరం నిందితుడిని హైదరాబాద్ నాంపల్లి కోర్టుకు తీసుకువెళ్తామని డీఎస్పీ వివరించారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు నగేష్, శ్రీనివాస్ ఉన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి దేవాగౌడ్

- ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా దేవాగౌడ్‌పై కథనం



జానపద కళారంగంలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న దేవాగౌడ్ (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కర్రోల్ల దేవాగౌడ్ గాయకుడిగా, జానపద కళాకారుడిగా, కవిగా, రచయితగా, వ్యాఖ్యాతగా, సినీ ఆర్టిస్టుగా, లఘుచిత్ర దర్శకుడిగా, మోటివేషనల్ స్పీకర్గా, సోషల్ యాక్టివిస్టుగా, డ్యాన్సర్‌గా, నృత్య దర్శకుడిగా విభిన్న ప్రతిభను చూపుతున్నారు. ఎంఎస్సీ, బీఎడ్ చదివి ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన 5వ తరగతి నుంచే దేశభక్తి గేయాలు, జానపద పాటలు పాడేవారు..ఉపన్యాసాలు, వ్యాసరచనలు చేశారు. 18 సంవత్సరాల నుంచి కళారంగంలో రాణిస్తూ తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో గద్దర్, దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్ మరెందరో కళాకారులతో ధూం ధాం... కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషించారు. లఘుచిత్రాల్లో నటిస్తూనే సినిమాల్లో నటించే అవకాశం అందుకున్నారు. ఎన్నో సన్మానాలు, 7 రాష్ట్ర స్థాయి, 7 జాతీయ స్థాయి, 2 అంతర్జాతీయ స్థాయి అవార్డులను కూడా అందుకున్నాడు. ఇటీవలె మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో మల్టీ టాలెంటెడ్ పర్సన్‌గా ఆయన పేరు నమోదైంది.



పాల్వంచ మండలం ఫరీద్‌పేట్ గ్రామానికి చెందిన కర్రోల్ల సావిత్రి, నారాగౌడ్ గార్ల మూడవ సంతానమే దేవాగౌడ్. ఈయనకు భార్య సుమలత, కుమారుడు అఖిల్ గౌడ్, కుమార్తె వర్షిక ఉన్నారు. తండ్రి గీత కార్మికుడు, వ్యవసాయదారుడు, తల్లి బీడీ కార్మికురాలు నిరుపేద కుటుంబంలో జన్మించినా చిన్నప్పటి నుంచే ఎంతో కష్టపడి చదివి, మనోధైర్యంతో, స్వశక్తినే నమ్ముకుని, తెలివితేటలతో, కళా రంగంతో పాటు వివిధ రంగాల్లో కూడా విజయాలు సాధిస్తూ ఎంతో మందికి స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా దేవాగౌడ్ మాట్లాడుతూ.. చదువు, ప్రతిభ ఉండి కళారంగంలో రాణిస్తున్నందుకు, తెలంగాణ సాంస్కృతిక సారథిలో తనకు ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుకుంటునట్లు తెలిపాడు.